# ప్రెషర్ కుక్కర్

— చంద్రం

**బోనస్** డబ్బు చేతికి వచ్చింది.

"వెంటనే వెళ్ళి కొని తెచ్చెయ్యండి. అశ్రద్ధ చేస్తే ఈ డబ్బులు ఏదో విధంగా ఖర్చైపోతాయి. మళ్ళీ ఇంతట్లో మనకి అవకాశం రాదు!" అని తొందరపెట్టింది శ్రీమతి. ఆవిడ చెప్పింది యథార్థమే గనుక "అలాగే" అని నా సంపూర్ణాంగీకారం తెలియపరిచాను.

ప్రెషర్ కుక్కర్ కొనాలన్నది ఈనాటి ప్రతిపాదన కాదు. ఎప్పటిదో ఆ ఆలోచన. పరిస్థితుల ప్రాబల్యంవల్ల ఇప్పటివరకు ఆచరణలో పెట్టలేకపోయాం.

ఖర్చులకేం—ఎన్నో ఉంటాయి! వాటన్నింటినీ పక్కకు పెట్టి, ఆరు నూరైనా నూరు ఆరైనా, ఆఫీసర్ జవానైనా జవాను ఆఫీసరైనా సరే—ఈసారి ప్రెషర్ కుక్కర్ కొనకపోతే నేను నేనే కాను. ఏనద భీషణ శంఖము దేవదత్తమే—అని నేను ప్రతిజ్ఞ చేయటమేమిటి, మా ఆవిడ తథాస్తు అనటమేమిటి, డబ్బు జేబులో వేసుకొని నేను బయలుదేరట మేమిటి—అన్నీ అవ్యవధిగా జరిగిపోయినాయ్.

"నాలుగైదు చోట్ల ధర విచారించి, చవగ్గా ఉన్నచోట తీసుకోండి." అని హెచ్చరించింది శ్రీమతి నేను చెప్పులు వేసుకుంటుండగా.

పుచ్చు వంకాయల నుంచి పట్టుచీరల వరకూ బేరమాడటంలో మా ఆవిడకి మంచి పేరుంది ఆ వాడకట్టులో. నాకైతే ఆవిడ నేర్పరితనంమీద నమ్మకం కుదరలేదు గాని, ఇరుగు పొరుగు అమ్మలక్కలు మాత్రం గుమ్మాల ముందు బట్టల మూటలు దింపించి "వదినగారూ! ఈ చీర బేరమాడి పెట్టండి! అక్కయ్యగారూ! ఈ లంగా అడిగిపెట్టండి!" అని తరుచూ ఈవిడగారిని ఆహ్వానిస్తుంటారు.

రెండు వందల ఏభై రూపాయల ఖరీదు చెప్పిన చీరను నూట పాతిక నుంచి ప్రారంభించి బేరమాడటం చెడ్డ చిరాకు కలిగిస్తుంది నాకు. అసలు నన్నడిగితే—ఏ వస్తువైనా సరే బేర మనేది లేకుండా అన్నిచోట్లా ఒకే ధరకి ఎప్పుడైతే లభిస్తుందో అప్పుడన్న మాట ఈ దేశం నిజంగా బాగుపడినట్టు. సరే, ఇది విషయాంతరం. ప్రస్తుతాని కొస్తే

"షాపుల చుట్టూ ప్రదక్షిణాలు చేసి బేరమాడవలసిన కర్మ నాకేం పట్టిందోయ్? తిన్నగా మా సుబ్బిగాడి షాపుకే వెళ్ళి పట్టుకొచ్చేస్తాను." అన్నాను ధీమాగా మా ఆవిడకి సమాధానంగా.

"అతని షాపులో కుక్కర్లు కూడా ఉంటాయా?" -శ్రీమతి సందేహం.

అవమానం సుబ్బిగాడికి కాదు—నాకే జరిగినట్టనిపించింది. "ఏమిటి నీ ఉద్దేశం? మా సుబ్బిగాడి షాపంటే ఆషామాషీగా ఉందా నీకు? ఈ ఊళ్ళో ఉన్న పెద్ద షాపుల్లో అదొకటి. వాడి కొట్లో దొరకలేదంటే ఆ వస్తువు ఇంక ఈ ఊళ్ళోనే దొరకదన్న మాట! మైండిట్!" అని చరచరా గుమ్మం దిగేశాను.

"సర్లెండి. కొంచెం జాగ్రత్తగా చూసి తీసుకురండి!" అని వెనకనుంచి అందిస్తూనే ఉంది మా ఆవిడ చాదస్తంగా.

సుబ్బిగాడూ—పూర్తి పేరు సుబ్బారావు లెండి—నేనూ సహాధ్యాయులం. ఒకటవ తరగతి నుంచి బి. ఎ. వరకు కలిసే చదువుకున్నాం. కొంతకాలం బెంచిమేట్సుం. కొంతకాలం రూమ్మేట్సుం. చాలా విషయాల్లో, చాలా సందర్భాల్లో ఏకాభిప్రాయం కలిగి కలిసిమెలిసి తిరిగాం. ఉద్యోగాలు మాత్రం చెరొక డిపార్టుమెంటులోనూ వచ్చినయ్.

ఆ ఊరూ ఈ ఊరూ తిరిగి రెండేళ్ళ క్రితమే మళ్ళీ ఈ ఊళ్ళో కలుసుకున్నాం.


సుబ్బిగాడికి స్వతహాగా కొంత ఆస్తి ఉంది. భార్యా తరపున కొంత వచ్చి కలిసింది. అది పెట్టుబడిగా పెట్టి సెంటర్లో ఇటీవలే ఒక స్టీలు షాపు ప్రారంభించాడు. తను ఉద్యోగస్థుడు గనుక ఏ సాయంత్రం పూటో ఖాళీగా ఉన్నప్పుడు కాసేపు కొట్లో కూచుంటాడు. మిగిలిన సమయాల్లో వాళ్ళ ఆవిడ, బావమరిది, గుమస్తాల సాయంతో వ్యాపారం సాగిస్తుంటారు. వ్యాపార సంబంధమైన అన్ని విషయాలూ తెలిసిన గుమాస్తా ఒకడున్నాడు. అతనికి సహాయకులుగా మరో ఇద్దరు, ముగ్గురు కుర్రాళ్ళున్నారు.


ప్రారంభోత్సవానికి అందరితో కలిసి వెళ్ళాను. తరువాత నాలుగైదుసార్లు మా సుబ్బిగాడు కొట్లో ఉండే సమయాలు చూసుకొని వెళ్ళి కూర్చుని, పిచ్చాపాటీ మాట్లాడి వచ్చాను. ఇంతవరకు వాడి కొట్లో నే నేదీ కొనటం పడలేదు గాని, వెళ్ళిన ప్రతిసారీ "నేను లేకపోయినా, మన వాడెప్పుడొచ్చినా కాస్త చూసి ఇస్తూండండి!" అని వాళ్ళ గుమస్తాకి చెవుతూనే ఉన్నాడు సుబ్బిగాడు. కనుక ఎప్పుడు వెళ్ళినా ఆ కొట్లో మనకి తిరుగులేదని తెలిసినప్పటికీ, కాకతాళీయంగా వాడున్న సమయంలోనే వెళ్ళటం జరిగింది.


ఇంత కాలానికి మా సుబ్బిగాడి స్టీలు షాపులో ఒక వస్తువు—కాస్త ఖరీదైనది—కొనబోతున్నందుకు నాకు నిజంగా ఆనందం కలిగింది. హుషారుగా షాపులో అడుగు పెట్టాను. కాసేపు అదీ ఇదీ మాట్లాడి నెమ్మదిగా వచ్చిన పని చెప్పాను. ఆ సమయంలో 'కస్టమర్' హోదా కనిపించి ఉండాలి నాలో.

వెంటనే గుమస్తాని పిలిచి "మనవాడికి 'మాంఛి' ప్రెషర్ కుక్కర్ చూసివ్వవోయ్!" అని పురమాయించాడు సుబ్బిగాడు.

సరుకు తాలూకు మంచి చెడ్డలు, ధరవరలు... వగైరా వివరాలు బొత్తిగా తెలీవు సుబ్బిగాడికి. కొట్లో కూచునేదే తక్కువ. ఉన్న కాసేపైనా 'క్యాష్' వ్యవహారం తప్ప, మిగతా వివరాల జోలికి పోడు. అంతా గుమస్తా చూసుకోవలసిందే. మాటల సందర్భంలో ఇదివరకు రెండు మూడుసార్లు తనే అన్నాడా మాట. ఇతని భార్యకీ, బావమరదికీ







కొంతవరకు అమ్మకం వ్యవహారాలు తెలుసు.

ఒక కుక్కర్ చూపించాడు గుమాస్తా. "ఇప్పుడు ఎక్కువగా అమ్ముడుపోయే కంపెనీ ఇదే, సార్! మన్నికైనది. సైజు కూడా ఇదే బావుంటుంది, సార్!" మా ఆవిడ చెప్పిన కంపెనీ, సైజూ ఇవే. కనుక తల ఊగించాను.

"ఉపయోగించే విధానం గూడా వివరంగా చెప్పు!" ఆదేశించాడు సుబ్బిగాడు.

ఆ సమయంలో కొట్లో నేను తప్ప మరో కస్టమర్ ఎవరూ లేరు గనుక, తీరిగ్గా విపులీకరించాడు గుమాస్తా. నేను గూడా చాలా ఆసక్తిగా విన్నాను. కొన్ని సందేహాలు వెలిబుచ్చి, సంతృప్తికరమైన సమాధానాలు గూడా పొందాను.

చివరిగా "కంపెనీ వా డిచ్చే గిన్నెలు అంతగా బావుండవు, సార్! ఇప్పు డందరూ స్టీలు కంటైనరే వాడుతున్నారు. కనుక మీరు గూడా అదే తీసుకోండి." అని ఒక స్టీలు కంటైనర్ తీసి చూపించాడు గుమాస్తా.

నాక్కూడా అదే నచ్చింది "అలాగే కానియ్." అన్నాను.

ఒక కుర్రాడు, గుమాస్తా అందించిన కుక్కర్ స్టీలు కంటైనర్‌తో సహా అట్టపెట్టెలో పెట్టి పాక్ చేశాడు.

ఇక ధర విషయం. మా సుబ్బిగాడి షాపులో నేను బేరమాడవల సిన అవసరం ఏముంటుంది? వాడు చెప్పినంతా ఇచ్చెయ్యటమే.

"ఎంతివ్వ మంటావురా?" అని సూటిగా అడిగే శాను సుబ్బిగాణ్ణి.

"మొత్తం ఎంతోయ్ దీని ఖరీదు?" అని గుమాస్తాని అడిగాడు సుబ్బిగాడు.

ఒక కాగితం ముక్కమీద లెక్కవేసి సుబ్బిగాడి ముందుంచాడు గుమాస్తా.

"మొత్తం అయిదు వందల ఏభై అయిందిరా. ఓ పది తగ్గించి అయిదూ నలభై ఇవ్వు." అన్నాడు సుబ్బిగాడు.

పది రూపాయాల కన్నా ఎక్కువ తగ్గించటం వాడికే బావుండదు, తగ్గించమని అడగటం నాకూ బావుండదు. డబ్బు చెల్లించేసి కుక్కర్ అందుకున్నాను.

"కుర్రాణ్ణి పంపించనా ఇంటి దగ్గర పెట్టేసి వస్తాడు?" అన్నాడు సుబ్బిగాడు.

"కుర్రా డెందుకు మళ్ళీ? రిక్షాలో వెళ్ళిపోతాలే." అని చెప్పి బయటికి నడిచాను.

కుక్కర్ చూసి మహదానందపడిపోయింది మా ఆవిడ. ఇటీవలి కాలంలో ఆవిడ ముఖంలో అంత ఆనందం కనిపించటం నే నెప్పుడూ గమనించలేదు.

అట్టపెట్టె విప్పి కుక్కర్ బయటికి తీశాను.

షాపులో గుమాస్తా చెప్పగా విన్నవాటిలో గుర్తున్నంత వరకు మా శ్రీమతికి వివరించాలని నా తాపత్రయం. "ఇదిగో చూడు ఇది వెయిటు. దీని పేరు వాల్వు సపోర్టు. దీన్ని మెటల్ సేఫ్టీ వాల్వు అంటారు. ఇదేమో..."

నన్ను పూర్తిగా చెప్పనివ్వలేదు మా ఆవిడ. మధ్యలోనే అడ్డుకొని—"... అన్నీ నాకు తెలుసులెండి. ఉపయోగించే విధానం కూడా తెలుసు. మన పక్కింటివాళ్ళు వాడటం చూస్తూనే ఉన్నానుగా. పైగా ఇలాంటి వివరాలన్నీ కుక్కర్‌తో పాటు వాళ్ళిచ్చే ఈ పుస్తకంలో ఉంటాయి." అనేసింది.

కుక్కర్ విషయంలో నాకంటే మాఆవిడే అడ్వాన్సుగా ఉన్నదని తేలిపోయింది.

"ఇంతకీ ఎంత కిచ్చాడు మీ మిత్రుడు?"

"వాడు మామూలుగా అమ్ముకొనే ధరకి ఓ పది రూపాయలు తగ్గించి ఇచ్చాడు."

"అదే ఎంతని?"

"అయి దొందల నలభై."

"అయి దొందల నలభయ్యా!" ఆశ్చర్యం ధ్వనించిం దావిడ కంఠంలో. బహుశా తను ఆశించనంతగా మా సుబ్బిగాడు తగ్గించలేదన్నది ఆవిడ ఆశ్చర్యానికి కారణమై ఉంటుం దనుకున్నాను.

"అడక్కుండానే వాడు పది రూపాయలు తగ్గించాడు. ఇంకా తగ్గించమని అడగటం ఏం బావుంటుంది చెప్పు!"

"తగ్గించట మేమిటండి నా మొహం. దీని ధర అయిదు వందల రూపాయలే!"

"అయిదు వందలా?" ఈసారి ఆశ్చర్యపోవటం నా వంతైంది. కాని, వెంటనే కంటైనర్ మార్చిన సంగతి గుర్తొచ్చింది. "కంపెనీ వా ళ్ళిచ్చే గిన్నెలు మార్చేసి, స్టీలు కంటైనర్ వేయించా." అని చెప్పాను.

"స్టీలు కంటైనర్‌తో కలిపే ఈ కుక్కర్ అయిదు వందలు. మన ఎదురింటి మీనాక్షిగారు నిన్న

